సాక్షి రాజన్న సిరిసిల్ల

గురువారం । 26 । సెప్టెంబర్ । 2024



ఆరుద్ర నక్షత్ర పూజలు

వేములవాడ: రాజన్న ఆలయంలో బుధవారం ఆరుద్ర నక్షత్రోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు.



మున్సిపల్ సిబ్బంది 'ఆట'విడుపు

సిరిసిల్లటౌన్: స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా బుధవారం సిరిసిల్ల బల్దియా సిబ్బంది ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఆడారు. ఇన్‌చార్జి కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్ తదితరులు పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/24.0

ఆకాశం మేఘావృతమవుతుంది. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురు గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

బాధ్యతల స్వీకరణ



బోయినపల్లి మార్కెట్ కమిటీ పాలకవర్గం

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించింది. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బోయిని ఎల్లేశ్ యాదవ్, వైస్ చైర్మన్‌గా నిమ్మ వినోద్‌రెడ్డి, డైరెక్టర్లుగా హరికృష్ణ, యూసఫ్, వెంకటేశ్వర్లు, రమేశ్, రాజశేఖర్‌రెడ్డి, లచ్చయ్య, ప్రదీప్‌కుమార్, సతీశ్, మహేశ్, అజయ్, పీఏసీఎస్ ,చైర్మన్ వెంకట్రామారావు, బోయినపల్లి ప్రత్యేకాధికారి భీమ జయశీల తదితరులు బాధ్యతలు స్వీకరించారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి రమణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



కలెక్టరేట్ ఎదుట మున్సిపల్ కార్మికుల ధర్నా

సిరిసిల్ల అర్బన్: మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. మున్సిపల్ కార్మికులకు నెలసరి జీతం రూ.26 వేలు ఇచ్చి ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. పీఆర్సీ, పీఎఫ్, ఈఎస్‌ఐ పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేసి కనీస వేతనం అమలు చేయాలని అన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, అన్నల్‌దాస్ గణేశ్, నక్క దేవదాస్, సందుపట్ల పోచమల్లు, కాసారపు శంకర్, దొబ్బల లచ్చయ్య, దేవరాజు, రాజయ్య, బాలయ్య, ఉమ, శంకరవ్వ, రవి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు అండగా ప్రధాని



మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ: ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి దేశ ప్రధాని నరేంద్ర మోదీ కట్టుబడి ఉన్నారని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్ అన్నారు. బుధవారం వేములవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అమెరికా వేదికగా రాహుల్‌గాంధీ మాట్లాడిన రిజ ర్వేషన్ల తీరును బీజేపీ ఖండిస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు రద్దు చేస్తుందని అబద్ధపు మాట్లాడిన రాహుల్‌గాంధీ వెంటనే నరేంద్ర మోదీకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ చందుర్తి మండల అధ్యక్షుడు రాకేశ్, గంగరాజు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీరు అందించాలి

కోనరావుపేట: గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించాలని ఆర్డీవో, మండల ప్రత్యేకాధికారి రాజేశ్వర్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మంచినీటి సహాయకులకు నిర్వహించిన శిక్షణలో మాట్లాడారు. నీటి శుద్ధి, క్లోరినేషన్ విధానంపై అవగాహన కల్పించారు. మనిషికి నీరే జీవనాధారమని, నీరు కలుషితమైతే అతిసారా, కలరా, టైఫాయిడ్ తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. మిషన్ భగీరథ నీటిని ఫ్లోరైడ్, కాల్షియం, లవణాలు తగు మోతాదులో ఇంజినీర్ల పర్యవేక్షణలో అందించబడుతుందని తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ విజయ్‌కుమార్, ఏఈలు కల్పన, విశ్వస్, ట్రైనర్ రాజిరెడ్డి, పంప్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

సిరిసిల్లటౌన్: మాజీ సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే అందించాలని మాజీ సర్పంచుల ఫోరం జేఏసీ అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో పెండింగ్ బిల్లుల సాధనకై నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ పాలనలో సర్పంచులు అప్పులు తెచ్చి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టారని అన్నారు. పది నెలలుగా రాష్ట్ర సర్కారు తమ సమస్యలను నాన్చుతుందే తప్ప పరిష్కరించడం లేదని విమర్శించారు. ఈ సమావేశంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి దుమ్ము అంజయ్య, నాయకులు గణప శివజ్యోతి, వెన్నమనేని వంశీకృష్ణ, చల్ల నారాయణ, కోలా నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

'స్థానికం' గెలవండి.. టికెట్ పొందండి!

- ప్రతీచోట విజయం సాధించాలి
- ఉమ్మడి జిల్లా నేతలకు కాంగ్రెస్ పెద్దల స్పష్టీకరణ
- కరీంనగర్ సీపీ, సిరిసిల్ల ఎస్పీలపై పీసీసీ చీఫ్‌కు ఎమ్మెల్యేల ఫిర్యాదు
- సమావేశ జాబితాలో పేరు లేకపోవడంపై అలిగిన జీవన్‌రెడ్డి
- రుణమాఫీ, రేషన్‌కార్డుల ప్రక్రియ వేగిరం చేయాలన్న 'అడ్లూరి'
- కార్పొరేషన్లను గెలుస్తామని మంత్రులు దుద్దిళ్ల, పొన్నం ధీమా
- వరుస పర్యటనలకు మంత్రుల కసరత్తు!



ఇటీవల ఉమ్మడి జిల్లా నేతలతో సమావేశమైన దీపాదాస్ మున్షీ, మహేశ్‌కుమార్ గౌడ్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతీచోట పార్టీ విజయం సాధించాలని.. అలాగైతేనే మరోసారి టికెట్ దక్కుతుందని కాంగ్రెస్ పెద్దలు స్పష్టం చేశారు. దీంతో కరీంనగర్ ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలందరూ వారం రోజులుగా ఆ దిశగా పని చేస్తున్నారు. గత వారం హైదరాబాద్‌లో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, కంటెస్టెడ్ ఎమ్మెల్యేలు, ఎంపీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చకు వచ్చిన పలు అంశాలు జిల్లా రాజకీయాల్లో ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. ముఖ్యంగా పోలీసు, రెవెన్యూ, ఇతర విభాగాల్లో పనిచేసే కీలక అధికారులను మార్చాలని, వారు తమకు సహకరించడం లేదని పలువురు ఎమ్మెల్యేలు ఫిర్యాదులు చేయడంపై ఆయా డిపార్ట్‌మెంట్లలో జోరుగా చర్చ జరుగుతోంది.

సీపీ, ఎస్పీలను మార్చాల్సిందే..

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి, సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్‌లను మార్చాల్సిందేనని ఎమ్మెల్యేలు పట్టుబట్టారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మరోసారి కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి విషయాన్ని లేవనెత్తారు. ఆయన ఏమాత్రం సహకరించడం లేదని, వెంటనే తప్పించాలని పీసీసీ చీఫ్‌కు ఫిర్యాదు చేశారు. ఇటీవల సీపీపై కవ్వంపల్లి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. అదే సమయంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సీపీ మహంతి పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. ఇక, సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్‌పై ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయం బయటకు రావడంతో రాజన్నసిరిసిల్ల జిల్లా పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో చర్చనీయాంశమైంది. హోంశాఖ సీఎం రేవంత్‌రెడ్డి వద్దే ఉండటంతో ఏ నిర్ణయం తీసుకుంటారోనన్న ఉత్కంఠ నెలకొంది.

- బీఆర్‌ఎస్ హయాంలో జగిత్యాల జిల్లాలో నియమితులైన పలువురు అధికారులు ఎమ్మెల్యేలకు ఏమాత్రం సహకరించడం లేదని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆరోపించారు. రుణమాఫీ, రేషన్‌కార్డుల ప్రక్రియ వేగిరం చేయాలని కోరారు.
- ప్రభుత్వం చేస్తున్న అనేక పనులను మరింత సమర్థంగా చెప్పుకోవాల్సిన అవసరం ఉందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అభిప్రాయపడ్డారు.

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కినుక..

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సమావేశానికి హాజరయ్యారు. ప్రస్తుతం కరీంనగర్ నుంచి పట్టభద్రుల స్థానానికి ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కానీ, ఆయన పేరు సమావేశ జాబితాలో లేకపోవడంతో బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. పొరపాటును గుర్తించిన పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్.. వెంటనే జీవన్‌రెడ్డికి సర్ది చెప్పారు. ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన నేపథ్యంలో ఆయన పేరు నిజామాబాద్ జిల్లాలో ఉందని తెలిపారు. ఈ సమావేశానికి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ హాజరవడంపైనా జీవన్‌రెడ్డి కినుక వహించారని సమాచారం. ఈ రెండు విషయాల్లో ఎమ్మెల్సీ, ఆయన అనుచరులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

ఇక మంత్రుల వరుస పర్యటనలు!

ఈ సమావేశానికి హాజరైన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయబావుటా ఎగురవేస్తుందని చెప్పారు. రామగుండం, కరీంనగర్ కార్పొరేషన్లను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. అదే సమయంలో ఇన్‌చార్జి మంత్రి ప్రతీ నెల రివ్యూలు చేపట్టాలని, 15 రోజులకోసారి ఏదైనా నియోజకవర్గంలో పర్యటించాలని పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ సూచించారు. దీంతో ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులతోపాటు ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్ని నియోజకవర్గాల్లో వరుస పర్యటనలకు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది.

బతుకమ్మ, దసరా పండుగలకు ఏర్పాట్లు చేయండి



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- గ్రామాల్లో సుందరీకరణ కనబడాలి
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: బతుకమ్మ, దసరా పండుగలకు గ్రామాల్లో భారీ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం మర్రిపల్లి గ్రామం రైతువేదికలో వేములవాడ, వేములవాడరూరల్, చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట మండలాల ఇన్‌చార్జిలు, కార్యదర్శులు, గ్రామాల ప్రత్యేక అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లోని ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పండుగలకు గ్రామాల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ప్రధాన కూడళ్లలో పూలకుండీలు, విద్యుత్ లైట్లు, డ్రెయినేజీలతో పాటు శానిటేషన్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. రోడ్లు, బతుకమ్మ ఘాట్ల వద్ద ఇబ్బందులు పడకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పాత పద్ధతి మార్చుకోండి

గ్రామాల్లోని సమస్యలను ఆయా మండలాల స్పెషల్ ఆఫీసర్లు, గ్రామ కార్యదర్శులను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో శానిటేషన్, పిచ్చిమొక్కలు, వీధిలైట్లు, సీసీ రోడ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామాలకు ఎమ్మెల్యే వచ్చినప్పుడు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని, పాత పద్ధతి మార్చుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీపీవో శేషాద్రి, డీఎల్‌పీవో గీత, ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి

వేములవాడఅర్బన్: ఇందిరా మహిళా శక్తి పథకంతో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రుద్రవరంలో ఓపెన్‌జిమ్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఇందిరా మహిళా పథకంలో భాగంగా అంబేడ్కర్ స్వయం స్వశక్తి సంఘం ఆధ్వర్యంలోఏ ర్పాటు చేసిన డెయిరీ పార్లర్, శ్రీలక్ష్మీ స్వయం స్వశక్తి సంఘం ఏర్పాటు చేసిన లేడీస్ ఎంపోరియంను ప్రారంభించారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసే లక్ష్యంతో ముందుకు పోతున్నారన్నారు. ముంపు గ్రామాల సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తానని తెలిపారు. డీఆర్‌డీఏ శేషాద్రి, ఎంపీడీవో రాజీవ్ మల్హోత్ర, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కనకయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌తోనే ఎల్లంపల్లి ప్రాజెక్టు

చందుర్తి: దివంగత సీఎం వైఎస్సార్‌తోనే ఈ ప్రాంతానికి శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు వచ్చిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం మల్యాల గ్రామశివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించి ధాన్యం కొనుగోలు కల్లంను పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అనేక పథకాలు అందించి అండగా నిలిచిందన్నారు.

విద్యాసంస్థల్లో ఫ్యాకల్టీ పోస్టులకు ఇంటర్వ్యూలు

సిరిసిల్ల: జిల్లాలోని మైనార్టీ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న ఫ్యాకల్టీ పోస్టులకు ఔట్ సోర్సింగ్, గెస్ట్ ఫ్యాకల్టీ పద్ధతిలో భర్తీ చేసేందుకు బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఇంటర్వ్యూలు నిర్వహించారు. 8పోస్టులు ఉండగా ఒక్కో పోస్టుకు ఆరుగురు చొప్పున అభ్యర్థులను ఇంటర్వ్యూకు పిలిచారు. కార్యక్రమంలో ఆర్‌ఎల్‌సీ రాజేందర్, జిల్లా ఇన్‌చార్జి మైనార్టీ ఆఫీసర్ రాధాభాయ్, ఓఎస్‌డీ సర్వర్‌మియా, విద్యా సంస్థల ప్రధానాచార్యులు లక్ష్మీనారాయణ, ఫాతిమా పాల్గొన్నారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

లీడర్లే.. డీలర్లు!

- రేషన్ షాపులను పంచుకున్నారు..
- సిఫార్సులు కొన్ని.. చేతవాటమే అన్నీ..
- రాత పరీక్షలు నిర్వహించి వెల్లడించని మెరిట్ లిస్ట్
- గోప్యంగా ఇంటర్వ్యూలు.. గుట్టుగా నియామకపత్రాలు
- సిరిసిల్లలో రెవెన్యూ వసూళ్ల పర్వం
- కోర్టుకెళ్లిన అభ్యర్థులు



తహసీల్దార్ ఆఫీస్ నుంచి మంగళవారం రాత్రి నియామకపత్రంతో వెళ్తున్న కాంగ్రెస్ నాయకుడు



సిరిసిల్లలోని రేషన్‌షాపులో బియ్యం తూకం(ఫైల్)

సిరిసిల్ల: పేదవర్గాలకు ప్రజాపంపిణీలో భాగంగా బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులను చౌక ధరలకే అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాలు రాజన్న సిరిసిల్ల జిల్లాలో రాజకీయ పునరావాస కేంద్రాలయ్యాయి. నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు అర్హులైన విద్యావంతులకు రేషన్‌షాపులను కేటాయించాల్సి ఉంది. కానీ సిరిసిల్ల రెవెన్యూ డివిజన్‌లో రెండు రోజుల క్రితం నియమించిన 52 రేషన్ దుకాణాల కేటాయింపులు రాజకీయ సిపార్సులు, ఆర్థిక వసూళ్లకు అడ్డాగా మారిందనే విమర్శలున్నాయి. ఎంపికైన రేషన్ డీలర్లలో లీడర్లు, వారి కుటుంబసభ్యులు ఉండడం చర్చనీయాంశమైంది. లీడర్లే రేషన్ డీలర్లుగా నియామకం కావడం అదీ గోప్యంగా.. రాత్రి వేళల్లో జరగడం అనుమానాలకు మరింత బలాన్నిస్తుంది. సిరిసిల్లలో జరిగిన రెవెన్యూ అక్రమాలపై ప్రత్యేక కథనం.

ఏం జరిగిందంటే..

సిరిసిల్ల రెవెన్యూ డివిజన్‌లో ఖాళీ ఏర్పడిన 58 రేషన్ దుకాణాల డీలర్ల భర్తీకి ఆగస్టు 29న సిరిసిల్ల ఆర్డీవో ఎల్.రమేశ్ నోటిఫికేషన్ జారీ చేశారు. సెప్టెంబరు 4లోగా అర్హులైన అభ్యర్థులు తహసీల్దార్ ఆఫీసుల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 52 రేషన్‌షాపులకు 830 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేశారు. ఆరు దుకాణాలకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. సెప్టెంబరు 15న సిరిసిల్లలో నిర్వహించిన రాతపరీక్షలకు 765 మంది అభ్యర్థులు హాజరై పరీక్షలు రాశారు. ఒక్కో రేషన్ షాపునకు ఐదుగురు అర్హత సాధించిన అభ్యర్థులను ఓరల్ ఇంటర్వ్యూలకు పిలిచారు. కానీ పరీక్షల్లో మెరిట్ జాబితాను రెవెన్యూ అధికారులు ఎక్కడా వెల్లడించలేదు. మెరిట్ జాబితా వెల్లడించకపోవడంపై అభ్యర్థులు నిరసన వ్యక్తం చేశారు. కేవలం ఎంపికైన వారు మాత్రమే రావాల్సిందిగా సమాచారం అందించి ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ఆర్డీవో ఫోన్ స్విచ్ఛాఫ్..

రేషన్ డీలర్ల ఎంపికలో అక్రమాలు జరిగినట్లు వస్తున్న ఆరోపణలపై వివరణ కోరేందుకు సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్‌కు వెళ్లగా ఆయన అందుబాటులో లేరు. కలెక్టరేట్‌కు వెళ్లారని ఆఫీస్ అధికారులు సమాచారమిచ్చారు. ఆర్డీవో ఫోన్ స్విచ్ఛాఫ్ ఉంది. సాయంత్రం ఆర్డీవో ఫోన్ రింగ్ అయినా స్పందించ లేదు.

రేషన్‌షాపుల ఖాళీల వివరాలు

ఇల్లంతకుంట మండలంలోని గాలిపల్లి, ఆరెపల్లి, గొల్లపల్లి, పత్తికుంటపల్లి, గంభీరావుపేట మండలంలోని దమ్మన్నపేట, లక్ష్మీపూర్, రాజుపేట, ఒడ్డెర కాలనీ, గంభీరావుపేట మండల కేంద్రంలో రెండు షాపులు, ముస్తాబాద్ మండల కేంద్రంతో పాటు పోతుగల్‌లో రెండు, గూడూరు, నామాపూర్, సేవాలాల్ తండా, వెంకట్రావుపల్లె, సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని 11 రేషన్ షాపులు, రగుడు, సర్దాపూర్, ముష్టిపల్లి, చిన్నబోనాల, చంద్రంపేట, పెద్దూరు, తంగళ్లపల్లి మండల కేంద్రంతో పాటు, నేరెళ్ల, చిన్నలింగాపూర్, పద్మనగర్, ఇందిరానగర్, గండి లచ్చపేట, వేణుగోపాల్‌పూర్, కేసీఆర్ నగర్, దేశాయిపల్లి, ఇందిరానగర్(జిల్లెల్ల), బాలమల్లుపల్లె, పాపయ్యపల్లె, చీర్లవంచ, ఇందిరమ్మ కాలనీ, నర్సింహులపల్లి, వీర్నపల్లి మండల కేంద్రం, గర్జనపల్లి, ఎల్లారెడ్డిపేట మండలంలోని అల్మాస్‌పూర్, తిమ్మాపూర్, బొప్పాపూర్, హరిదాస్‌నగర్, దుమాల, రాగట్లపల్లి, పోతిరెడ్డిపల్లె గ్రామాల్లో రేషన్ డీలర్ పోస్టులు ఖాళీ ఉన్నట్లు ప్రకటించారు.

నిబంధనలు గాలికి..

రేషన్‌షాపులకు రిజర్వేషన్లు ఉన్నాయని, పదో తరగతి పాసై 18–40 ఏళ్ల మధ్య వయస్సు గల స్థానికులు అర్హులని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు దరఖాస్తులకు అనర్హులని వెల్లడించారు. కానీ నిబంధనలను గాలికి వదిలేస్తూ రేషన్ డీలర్ల నియామకాలు జరిగాయి. అందులో మచ్చుకు కొన్ని..

- సిరిసిల్లలోని షాపు నం.3908012కు ఎక్స్‌సర్వీస్ మెన్ కోటాలో చొప్పదండి రాజేశ్‌కు కేటాయించారు. ఇతనికి ఇప్పటికే ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ శివారులో పెట్రోల్ బంక్ ఉంది. ఎక్స్‌సర్వీసు మెన్ కోటాలో ప్రభుత్వ భూమిని ఇప్పటికే పొందారు. అదనంగా ఇప్పుడు రేషన్ షాపును దక్కించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ సమీప బంధువు కావడంతో అతనికి రేషన్‌షాపు వచ్చినట్లు భావిస్తున్నారు.
- సిరిసిల్లలోని మున్సిపల్ కౌన్సిలర్ కొడుకుకు ఎస్సీ కోటాలో ఓ రేషన్ షాపు కేటాయించారు. ప్రజాప్రతినిధులు, వారి కుటుంబసభ్యులు అనర్హులని నిబంధనల్లో ఉంది. అయినా కేటాయింపులు జరిగాయి.
- కాంగ్రెస్ పార్టీలో ఎప్పటి నుంచో పనిచేస్తున్న ఓ సీనియర్ కార్యకర్త కొడుక్కి రేషన్‌షాపు అప్పగించారు. మరో పదవి భవిష్యత్‌లో ఇవ్వమనే ఒప్పందం మేరకు రేషన్ డీలర్ పోస్టు అతని కొడుక్కి కేటాయించారు.
- మరో మాజీ కౌన్సిలర్ కొడుకుకు రేషన్‌షాపును కేటాయించారు.
- తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన ఓ కాంగ్రెస్ నేత కూతురు పేరిట కూడా రేషన్ షాపు కేటాయించారు.
- ముస్తాబాద్ మండలం పోత్గల్‌లో కాంగ్రెస్ నాయకుడికి రేషన్ షాపు కేటాయించగా.. వెంకట్రావుపల్లెలో ఎంపీటీసీగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన వ్యక్తికి కేటాయించారు. మరో షాపును బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వ్యక్తికి కాంగ్రెస్ పార్టీ లీడర్ల సిపార్సు మేరకు నియమించారు.
- వీర్నపల్లి మండలంలోనూ అర్హులను పక్కన పెట్టి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకే రేషన్‌షాపులు ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి.
- సిరిసిల్ల పట్టణ శివారు గ్రామాల్లోని రేషన్‌షాపులను స్థానికులకు కాకుండా సిరిసిల్ల పట్టణానికి చెందిన కాంగ్రెస్ నేతల అనుచరులకు కేటాయించారనే ఆరోపణలున్నాయి.

సిపార్సుల పేరిట వసూళ్ల పర్వం..

అధికార పార్టీ నేతల సిపార్సుల పేరిట మరోవైపు వసూళ్ల పర్వం సాగినట్లు సమాచారం. ఆయా షాపులకు ఉన్న డిమాండ్‌ను బట్టీ ఆ పార్టీ ముఖ్యనాయకులు రూ.2లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వసూళ్లకు పాల్పడ్డారు. రెవెన్యూ అధికారులు సైతం ఇదే అదనుగా సిపార్సుతోపాటు.. డబ్బులు వస్తున్నాయనే ధీమాతో ఇంటర్వ్యూల అనంతరం ఎంపిక అభ్యర్థుల జాబితాను వెల్లడించకుండా గోప్యంగా రాత్రి వేళల్లో డీలర్లకు నియామకపత్రాలు అందించారు. సిరిసిల్ల డివిజన్‌లో జరిగిన రేషన్ డీలర్ల అక్రమాలపై నేరుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని సిరిసిల్లకు చెందిన ఓ వితంతు మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ డీలర్ల ఎంపికలో జరిగిన అక్రమాలపై బాధితులు కొందరు పారదర్శకంగా నియామకాలు జరగలేదని, నిబంధనలను పాటించలేదని పేర్కొంటూ కోర్టుకు వెళ్లారు. మొత్తంగా సిరిసిల్ల డివిజన్‌లో రేషన్ డీలర్ల నియామకాలు రాజకీయంగా చర్చనీయాంశమైంది.

జాతరగ్రౌండ్ ఆక్రమణలపై కొరడా

- టేలాలు, పందిళ్లు తొలగించిన ఆలయ అధికారులు



ఆక్రమణలను తొలగిస్తున్న ఆలయ సిబ్బంది

వేములవాడ: జాతరా గ్రౌండ్‌లో రోడ్డును ఆక్రమించి నిర్మించిన టేలాలు, పందిళ్లను ఆలయ అధికారులు బుధవారం మున్సిపల్ అధికారులతో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి మాట్లాడుతూ జాతర గ్రౌండ్, భక్తులు తిరిగే ప్రదేశాల్లో ప్రైవేటు వ్యాపారులు తమకు తెలియకుండా స్థలాలను కబ్జా చేసుకొని టేలాలు, పందిళ్లు వేసుకున్నారని అన్నారు. దీంతో డ్రెయినేజీ సిస్టం పూర్తిగా దెబ్బతిని వర్షపు నీరంతా రోడ్డుపై ప్రవహిస్తోందని తెలిపారు. పవిత్రంగా ఆలయానికి చేరుకోవాల్సిన భక్తులు ఇబ్బంది పడుతున్నట్లు తమకు ఫిర్యాదులు వచ్చాయన్నారు. భక్తుల ఫిర్యాదు మేరకు ఆక్రమణలను తొలగిస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో పలువురు వ్యాపారులు తమ ఉపాధి పోతుందని ఆవేదన వ్యక్తం చేయడంతో ఆలయానికి సంబంధించిన దుకాణాల వేలంలో తప్పకుండా అవకాశం కల్పిస్తామని అన్నారు. ఆలయ ప్రదేశంలో ఎవరైన ఆక్రమణలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈవో వినోద్‌రెడ్డితో పాటు ఈఈ రాజేశ్, డీఈ మహిపాల్ రెడ్డి, ఏఈవో శ్రావణ్, పర్యవేక్షకులు వరి నర్సయ్య, విజయ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఎస్పీఎఫ్ ఏఎస్సై కరణ్‌సింగ్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు భారీ వర్షాలు

సిరిసిల్ల: జిల్లా వ్యాప్తంగా బుధవారం ఓ మోస్తరు భారీ వర్షాలు కురిశాయి. ఓ వైపు ఎండ కొడుతూనే మరోవైపు వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా ఇల్లంతకుంటలో 50.4 మిల్లీ మీటర్ల వర్షం పడగా.. సిరిసిల్లలో 20.4, రుద్రంగిలో 0.4, చందుర్తిలో 1.3, వేములవాడ రూరల్‌లో 3.3, వేములవాడలో 5.7, కోనరావుపేటలో 13.8, వీర్నపల్లిలో 11.3, ఎల్లారెడ్డిపేటలో 3.9, గంభీరావుపేటలో 1.9, ముస్తాబాద్‌లో 20.8, తంగళ్లపల్లిలో 14.0 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. బోయినపల్లిలో పెద్దగా వర్షం పడలేదు.

క్లుప్తంగా

హత్య కేసులో ఇద్దరికి జైలు

సిరిసిల్లకల్చరల్: హత్య కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత బుధవారం తీర్పునిచ్చారు. ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలా నికి చెందిన పండుగ రాజంకు తన సోదరి పండుగ మరియమ్మకు ఆస్తి పంపకాల్లో తగదా ఏర్పడింది. మరియమ్మ, ఆమె కుమారుడు మల్లేశం ఇద్దరూ కలిసి రాజంను హత్య చేసేందుకు 2020 సెప్టెంబర్ 1న ప్రణాళిక వేసుకొని గొడ్డలితో నరికి చంపారు. ఈ ఘటనపై అప్పటి సిరిసిల్ల రూరల్ సీఐ సర్వర్ కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. కేసు పూర్వాపరాల పరిశీలన తర్వాత నేరం రుజువైన కారణంగా మల్లేశంకు జీవిత ఖైదు, మరియమ్మకు పదేళ్ల కారాగార శిక్ష, చెరో రూ.2,500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

దొంగతనం కేసులో వ్యక్తికి జైలు

వేములవాడ: దొంగతనం కేసులో కాశెట్టి వెంకటేశంకు 18 నెలల కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ వేములవాడ ప్రథమశ్రేణి న్యాయమూర్తి జ్యోతిర్మయి బుధవారం తీర్పు వెల్ల డించినట్లు పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. వేములవాడకు చెందిన మోత్కుపల్లి ఎల్లయ్య షాప్‌లోని క్యాష్ కౌంటర్ నుంచి ఆగస్టు 15, 2023న రూ.50వేలు కాశెట్టి వెంకటేశం దొంగిలించినట్లు తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారన్నారు. కేసు విచారణ, పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి జ్యోతిర్మయి నేరస్తుడు కాశెట్టి వెంకటేశ్‌కు 18 నెలల కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించినట్లు తెలిపారు. దొంగతనాలకు పాల్పడితే జైలు శిక్ష తప్పదని సీఐ హెచ్చరించారు.

3 క్వింటాళ్ల కాపర్‌వైర్ చోరీ

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): శాస్త్రీనగర్‌లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు(రిపేర్)చేసే సెంటర్‌లో దాదాపు రూ.లక్ష విలువైన కాపర్‌వైర్ చోరీకి గురైంది. ఈ దొంగతనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. కొందరు దొంగలు సోమవారం రాత్రి శాస్త్రీనగర్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ కేంద్రం వద్దకు వచ్చారు. కిటికీల్లోంచి లోపలకి చొరబడ్డారు. అక్కడి సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. నిల్వ ఉన్న దాదాపు మూడు క్వింటాళ్ల కాపర్‌వైర్ అపహరించుకు వెళ్లారు. దాని విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు. బాధితుడు నరేందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్నట్లు ఎస్సై వివరించారు.

రాష్ట్ర ప్రధాన ఆలయాల జేఏసీ కార్యవర్గం ఎన్నిక

వేములవాడ: వేములవాడలో బుధవారం జరిగిన రాష్ట్ర దేవాదాయ ఉద్యోగుల జేఏసీ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా మారం జగదీశ్వర్, చైర్మన్‌గా గజవెల్లి రమేశ్‌బాబు, డిప్యూటీ చైర్మన్లుగా బుద్ది శ్రీనివాస్, ఆర్.సుదర్శన్, చంద్రశేఖర్, గౌరవ సలహాదారులుగా జె.దయాకర్‌రెడ్డి, డి.భాస్కర్, సాయి, ఎస్.హరికిషన్, జె.కృష్ణ, ఉమేష్‌శర్మ, వరినర్సయ్య, ఎస్. శ్రీరాములు, కె.వెంకటాచార్యులు, టి.కపీంద్రాచారి, గట్టు మదన్‌కుమార్, వైస్ చైర్మన్‌గా మల్లికార్జున్, కె.నిరంజన్, ప్రధాన కార్యదర్శిగా రంగారావు, సహాయ కార్యదర్శులుగా సువర్ణ రాధాకిషన్, గట్టు శ్రవణ్‌కుమార్, మంద స్వామి, సునీల్‌కుమార్, నవీన్‌శర్మ, ఎడ్ల శివసాయి, కార్యదర్శులుగా గంగా శ్రీనివాస్, కిరణ్‌కుమార్, కోశాధికారిగా సురేంద్రాచార్యులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా శ్రీధరశర్మ, గోలి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులుగా కట్కూరి వెంకటయ్య, నాగుల మహేశ్, మాధవాచార్యులు, క్రీడల కార్యదర్శిగా శ్రీనివాస్‌లతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

సహకార సంఘాలపై ఐటీ నజర్

- నోటీసులు జారీ
- పెనుభారంగా జీఎస్టీ



ఉమ్మడి జిల్లాలో సహకార సంఘాలు: 128
సహకార కేంద్ర బ్యాంకు శాఖలు: 67
సొసైటీల్లో మొత్తం సభ్యులు: 95,726

కరీంనగర్ అర్బన్: సహకార సంఘాలపై ఆదాయపు పన్ను శాఖ జూలు విదిల్చింది. క్రయవిక్రయాలు తదితర వాటిపై ఐటీ నుంచి నోటీసులు రావడంతో సంఘాలు కంగుతిన్నాయి. ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో ఇప్పుడిప్పుడే ఎరువులు, విత్తనాల విక్రయాలతోపాటు రైతుల నుంచి పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నాయి. ఆదాయాన్ని సమకూర్చుకుంటుండగా.. సదరు సంఘాలకు ఆదాయపు పన్ను శాఖ నుంచి నోటీసులు రావడంతో సంఘాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. క్రయవిక్రయాలపై వచ్చే ఆదాయంపై పన్ను చెల్లించాలని ఐటీ, సంఘాలు నిర్వహించే సేవారంగాలు, వ్యాపార లావాదేవీలకు జీఎస్టీ నోటీసులు రావడంతో సంఘాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

128 సంఘాలు..

ఉమ్మడి జిల్లాలో 128 వివిధ సహకార సంఘాలకు రూ.5లక్షల నుంచి రూ.కోటి వరకు చెల్లించాలని ఈ నోటీసుల్లో పేర్కొనడంతో సంఘాలు విస్తుపోతున్నాయి. సహకార సంఘాలు రైతుల కోసం పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. గతంలో సంఘాలు కేవలం పంట రుణాలు తదితర వాటికి పరిమితం కావడం, బినామీ పేరుతో చాలామంది రుణాలు తీసుకోవడంతో సంఘాలు నష్టాల్లో కూరుకుపోయాయి. ఇప్పటికీ 15కు పైగా సంఘాలు నామమాత్రంగానే ఉన్నాయి. కొన్ని సంఘాలు ఎరువులు, విత్తనాలు విక్రయించడం, రైతుల నుంచి కమీషన్‌తో పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడం, పెట్రోల్ బంకులు, సూపర్ మార్కెట్లు నిర్వహించి ఆదాయాన్ని పెంచుకుంటున్నాయి. మరికొన్ని సంఘాలు రైతుల నుంచి డిపాజిట్లు సేకరిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులు చేసే డిపాజిట్లు, తీసుకునే వడ్డీపైనా పన్ను చెల్లించాలని ఆదాయ పన్ను శాఖ నోటీసులు ఇచ్చింది. ఈ నోటీసులపై స్పందించిన సహకార సంఘాలు కమిషనర్‌ను కలిశాయి. రైతుల సేవలకు సంబంధించిన లావాదేవీలపై ఆదాయ పన్ను మినహాయించాలని వినతిపత్రం ఇచ్చినట్లు సహకార సంఘం నేతలు చెబుతున్నారు.

కేంద్ర పరిధిలోకి వెళ్లడమే కారణం

వాణిజ్య పన్నుల శాఖ గతంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండేది. అప్పుడు సంఘాలు నిర్వహించే వాటిపై పన్ను ఉండేది కాదు. 2017 జూలై 1 నుంచి వాణిజ్య పన్నుల శాఖ పరిధిలోని పన్నుల వసూళ్లు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని జీఎస్టీ కిందకు వెళ్లాయి. ఎరువుల విక్రయాలపై 5 శాతం, పురుగు మందుల విక్రయాలపై 18 శాతం పన్నును సంఘాలు జీఎస్టీ రూపంలో చెల్లించాల్సి వస్తోంది. గతంలో మాదిరిగానే సంఘాలు ఆదాయ, వ్యయాలకు సంబంధించి లెక్కలు చూపించడం లేదు. 2017 నుంచి 2021 వరకు సంవత్సరంవారీగా ఆదాయ, వ్యయ వివరాలను తెలియజేయాలంటూ నోటీసులు రావడంతో సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జీఎస్టీ నోటీసుల నేపథ్యంలో సహకార సంఘాలు చార్టెడ్ అకౌంటెంట్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకొని సంవత్సరంవారీగా ఆదాయ, వ్యయ వివరాలు అప్పజెప్పే పనిలో నిమగ్నమయ్యాయి.

కవర్లలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

- కొత్తపల్లి బ్రిడ్జి కింద లభ్యం
- పోస్టుమార్టం చేసినట్లు ఆనవాళ్లు
- వలస కూలీగా అనుమానిస్తున్న పోలీసులు


కవర్లలో ప్యాక్ చేసిన మృతదేహం

తిమ్మాపూర్(మానకొండూర్): కవర్లలో కట్టిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమవడం.. పోస్టుమార్టం చేసినట్లు ఆనవాళ్లు ఉండటం కలకలం రేపింది. ఎల్ఎండీ ఎస్సై వివేక్ తెలిపిన వివరాల ప్రకారం.. చిగురుమామిడి మండలంలోని చిన్న ముల్కనూర్‌కు చెందిన ఓ మత్స్యకారుడు బుధవారం చేపలు పట్టేందుకు తిమ్మాపూర్ మండలంలోని కొత్తపల్లి బ్రిడ్జి కింద నీటిలో దిగాడు. కొంత దూరం నుంచి ప్యాక్ చేసినట్లు ఉన్న ఏదో కొట్టుకురావడం అతనికి కనిపించింది. వెంటనే 100కు కాల్ చేశాడు. ఎస్సై వివేక్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. కవర్లను విప్పి, చూడగా ఓ వ్యక్తి మృతదేహం ఉంది. ఒంటిపై ఎలాంటి దుస్తులు లేవని, నీలం, తెలుపు రంగు కవర్లలో మృతదేహాన్ని ప్యాక్ చేశారని ఎస్సై తెలిపారు. మృతుడి వయసు 45 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. కొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పలు అనుమానాలు..

రెండు, మూడు రోజుల క్రితం మృతదేహాన్ని మోయతుమ్మెద వాగులో పడేసినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. చనిపోయిన వ్యక్తికి పోస్టుమార్టం నిర్వహించిన ఆనవాళ్లు ఉన్నాయి. మృతుడు బిహార్ లేదా మరో రాష్ట్రం నుంచి కూలీ కోసం వచ్చిన వ్యక్తిగా అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ఎల్ఎండీలో పడేసి ఉంటారా, అంత్యక్రియలకు డబ్బులు లేక వదిలేశారా, లేదా ఎవరైనా కావాలనే వాగులో పడేశారా అని పోలీసులు అనుమానిస్తున్నారు. సంఘటన స్థలం వద్దే మృతదేహానికి మరోసారి పోస్టుమార్టం నిర్వహించి, కరీంనగర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రశాంతంగా బాలుడి దహన సంస్కారాలు

- జగ్గాసాగర్‌లో సద్దుమణిగిన వివాదం
- మృతుడి తల్లిపై దాడి ఘటనలో పలువురిపై కేసు


మృతుడి తండ్రితో మాట్లాడుతున్న పోలీస్ అధికారులు

మెట్‌పల్లిరూరల్: తల్లి మందలించడంతో ఈనెల 8న ఆత్మహత్యకు పాల్పడి.. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందిన మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌కు చెందిన ఏనుగు ప్రభాస్ (19) దహన సంస్కారాలను బుధవారం కుటుంబసభ్యులు పూర్తిచేశారు. నివాసముంటున్న ఇల్లు, నాలుగెకరాల వ్యవసాయ భూమి తల్లి పేరుపై ఉండడంతో బదలాయింపు జరిగాకే అంత్యక్రియలు చేస్తామని కుటుంబసభ్యులు, కులస్తులు తేల్చి చెప్పిన విషయం తెల్సిందే. మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి బాలుడి కుటుంబసభ్యులు, గ్రామస్తులతో మాట్లాడారు. అంత్యక్రియలు పూర్తిచేయాలని, ఏమైనా సమస్యలుంటే తర్వాత చూసుకోవాలని సూచించారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం కొన్ని నిబంధనలుంటాయని, 36 గంటలు దాటితే తప్పనిసరిగా దహన సంస్కారాలు పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు. పోలీసుల సూచనలతో కార్యక్రమాలు చేశారు. తనకు అప్పులు ఉన్నాయని, తన భార్య పేరిట ఉన్న ఆస్తులు తన పేరున బదలాయింపు చేయాలని మృతుడి తండ్రి పోలీసులను వేడుకున్నాడు. మరోవైపు మృతుడి తల్లిపై దాడికి పాల్పడిన ఘటనలో పోలీసులు పలువురిపై కేసు నమోదు చేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మెట్‌పల్లి ఎస్సై-1 చిరంజీవి, ఎస్సై-2 రాజు, ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్, కోరుట్ల ఎస్సై-2 శ్వేత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తల్లి ఉద్యోగం చేయమన్నందుకే..

తన తల్లి ఉద్యోగం చేయాలని మందలించినందుకే తాను ఆత్మహత్య చేసుకున్నట్లు బాలుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా వాంగ్మూలం ఇచ్చాడని డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు క్లారిటీ ఇచ్చారు. దాని ఆధారంగానే ఫిర్యాదు తీసుకొని కేసు నమోదు చేశామని స్పష్టం చేశారు. అందులో ఎలాంటి అనుమానాలకూ తావులేదన్నారు.

అంకితభావంతో పనిచేయాలి


మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం

సిరిసిల్ల: ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు అందరూ అంకితభావంతో పనిచేయాలని జిల్లా సంక్షేమ అధికారి పి.లక్ష్మీరాజం అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ప్రత్యేక అదనపు అనుబంధ పోషకాహారంపై మహిళా, శిశుసంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్యశాఖలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో పిల్లల పెరుగుదల, బరువు, ఎత్తు కొలతలను పరీక్షించి అంగన్‌వాడీ టీచర్లు యాప్‌లో నమోదు చేస్తున్నారని తెలిపారు. ఈ వివరాలను సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపిస్తున్నామని, వైద్యాధికారి మూడు రోజులలోపు సదరు పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, పోషణపై కౌన్సెలింగ్ ఇస్తున్నారని వివరించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసంతరావు ఎనీమియా మాడ్యూల్ ఎలా నిర్వహించాలో మెడికల్ ఆఫీసర్లకు, సూపర్‌వైజర్లకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. సమావేశంలో జిల్లా ఉపవైద్యాధికారులు రాజగోపాల్, రజిత, జిల్లా ప్రోగ్రాం అధికారి ఉమా, రాష్ట్రీయ బాలస్వాస్థ్య యోజన ప్రోగ్రాం ఆఫీసర్ మహిమ, సీడీపీవోలు ఉమారాణి, సౌందర్య ఏసీడీపీవో సుచరిత, జ్యోతి, మెడికల్ ఆఫీసర్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, పోషణ అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు.

వంద శాతం రుణాల రికవరీ సాధించాలి



మాట్లాడుతున్న సంఘం చైర్మన్ బండి దేవదాస్

సిరిసిల్ల: సిరిసిల్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(సింగిల్ విండో) పరిధిలో వంద శాతం రుణాల రికవరీ సాధించాలని సంఘం చైర్మన్ బండి దేవదాస్ అన్నారు. బుధవారం సిరిసిల్ల సంఘ భవనంలో నిర్వహించిన మహాజన సభలో మాట్లాడారు. ప్రభుత్వం రైతుల పంట రుణాల మాఫీలో 750 మంది రైతులకు సంబంధించి రూ.5.78 కోట్లు జమ అయ్యాయన్నారు. కొందరు రైతుల కారణంగా సంఘం వంద శాతం రుణాల రికవరీకి దూరమవుతుందని తెలిపారు. అందరూ రుణాలపై వడ్డీలు చెల్లించేలా చూడాలని కోరారు. భవిష్యత్‌లో సహకార సంఘం సేవలను మరింత విస్తరించాలని, కొత్త పంట రుణాలు అందించాలని సమావేశంలో తీర్మానించారు. సహకార సంఘం వార్షిక నివేదికను కార్యదర్శి బి.నరేశ్ సమర్పించారు. ఈ సందర్భంగా రూ.5లక్షల చేపల పెంపకానికి రుణాన్ని, మరో రూ.8లక్షల భూమి అభివృద్ధి రుణం, రూ.2 లక్షల పాడిపరిశ్రమ రుణాలను లబ్ధిదారులకు అందించారు. ఈ సమావేశంలో సంఘం వైస్ చైర్మన్ వెంకటరమణారెడ్డి, భైరి ప్రభాకర్, గడీల సురేశ్‌కుమార్, సత్తు వెంకట్‌రెడ్డి, వెన్నమనేని శ్రీధర్‌రావు, శనిగరం లక్ష్మీ, పన్యాల ప్రమీల, కొమ్మెట పర్శయ్య, బండి దేవదాస్, బనావత్ గన్యానాయక్, సంఘం సిబ్బంది పి.వెంకటరమణారెడ్డి, ఆర్.బాబు, సీహెచ్ స్వామి, ఎస్.మల్లికార్జున్, సంఘ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

27న కొండా లక్ష్మణ్ జయంతి వేడుకలు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జిందం కళ

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో ఈనెల 27న సబ్బండ వర్గాలతో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. బుధవారం సిరిసిల్లలోని చేనేత వస్త్ర, వ్యాపార సంఘంలో పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ సాధనలో బాపూజీ పాత్ర ఎనలేనిదన్నారు. ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, నాయకులు చక్రపాణి, శ్రీనివాస్, వనిత, చంద్రకళ, రామ్మోహన్, రవి, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

28న యోగా టీచర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

పెద్దపల్లిరూరల్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆయుష్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆస్పత్రిల్లో ఖాళీగా ఉన్న 90 యోగా టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ అరుణ, పెద్దపల్లి డీపీఎం విద్యాసాగర్ బుధవారం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 842 పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అందులో 90 పోస్టులు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్నాయన్నారు. కరీంనగర్‌లో 30 పోస్టులు ఖాళీగా ఉండగా, పెద్దపల్లి జిల్లాలో 20, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 16, జగిత్యాల జిల్లాలో 24 యోగా టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో 50 శాతం పురుషులు, మిగతా 50శాతం మహిళా అభ్యర్థులకు కేటాయించినట్లు వారు వెల్లడించారు. ఎంపికైన వారు పార్ట్‌టైం విధానంలో పనిచేయాల్సి ఉంటుందన్నారు.

'అచీవర్స్'లో బ్లూ కలర్ దినోత్సవం



కరీంనగర్: కోతిరాంపూర్ అచీవర్స్ పాఠశాలలో పాఠ్యాంశంలో భాగంగా ప్రీ-ప్రైమరీ విద్యార్థినీ విద్యార్థులకు రంగుల దినోత్సవం సందర్భంగా రంగులపై అవగాహన కల్పించారు. విద్యార్థులు బ్లూ కలర్ దుస్తులు, వస్తువులు ప్రదర్శించి రంగులపై అవగాహన పెంపొందించుకున్నారు. డైరెక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యార్థులకు రంగుల ఆవశ్యకత తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రిన్సిపాల్ సీహెచ్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.

'అల్ఫోర్స్'లో ముందస్తు బతుకమ్మ


వేడుకలను ప్రారంభిస్తున్న చైర్మన్ నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో ముందస్తు బతుకమ్మ వేడుకలను బుధవారం వైభవంగా జరుపుకున్నారు. శ్రీదుర్గామాత విగ్రహానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి, వేడుకలను ప్రారంభించారు. సుమారు 250 మంది విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో వచ్చి, పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొనేలా బతుకమ్మ ఆడారు. సుమారు 500 బతుకమ్మలను విద్యార్థులు వివిధ రూపాల్లో తయారు చేసి, కోలాట ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మిడ్‌మానేరులో 25 టీఎంసీలు

బోయినపల్లి(చొప్పదండి): శ్రీరాజరాజేశ్వర(మిడ్‌మానేరు) ప్రాజెక్టులో నీటిమట్టం 25.22 టీఎంసీలకు చేరింది. బుధవారం ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ నుంచి వరదకాల్వ మీదుగా 9,259 క్యూసెక్కుల మేర నీరు ఇన్‌ఫ్లోగా వస్తోంది.

దొంగలకు గంజాయి విక్రయించిన వ్యక్తి అరెస్ట్

మెట్‌పల్లి: దొంగలకు గంజాయి విక్రయించిన ఘటనలో పట్టణ శివారులోని అర్బన్ హౌసింగ్ కాలనీకి చెందిన చందు అనే యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ నిరంజన్‌రెడ్డి కథనం ప్రకారం.. ఈ నెల 21న అర్ధరాత్రి సమయంలో బండలింగాపూర్ క్రాసింగ్ వద్ద మక్కజొన్నల లోడ్‌తో వెళ్తున్న ఓ వ్యాన్‌ను ముగ్గురు వ్యక్తులు ఆపి డ్రైవర్‌ను కొట్టారు. అతడి నుంచి సెల్‌ఫోన్‌తోపాటు రూ.5వేల నగదును ఎత్తుకెళ్లారు. డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. ఈనెల 23న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో వారి వద్ద ఉన్న గంజాయి గురించి ప్రశ్నించగా.. దానిని చందు వద్ద కొనుగోలు చేసినట్లు చెప్పారు. అప్పటినుంచి పరారీలో ఉన్న చందు బుధవారం ఇంటికి వచ్చాడనే సమాచారంతో అక్కడకు వెళ్లి అరెస్ట్ చేశారు. అతని నుంచి 350 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చందును పట్టుకున్న ఎస్సైలు అనిల్, చిరంజీవి, రాజు, ఇతర సిబ్బందిని సీఐ అభినందించారు.

ఇంజినీర్లు సృజనాత్మకంగా ఆలోచించాలి

తిమ్మాపూర్(మానకొండూర్): ఇంజినీర్లు సృజనాత్మకంగా ఆలోచించాలని అంతరిక్ష మాజీ శాస్త్రవేత్త డాక్టర్ టీపీ.శశికుమార్ అన్నారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలోని జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(అటానమస్) కళాశాలలో 'రేపటి ఇంజినీర్లు–డ్రీమ్స్, డిజైన్ అండ్ డెలివర్' అనే అంశంపై బుధవారం సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు ఇంజినీరింగ్‌కు సంబంధించిన అన్ని విభాగాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అకాడమిక్ విద్యకే పరిమితం కాకుండా టెక్నికల్, సాఫ్ట్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్చుకోవాలని సూచించారు.

హాలీవుడ్‌లో మనోడి సినిమా

- వృత్తి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం.. ప్రవృత్తి నటన
- స్వతహాగా 'ది డిజర్వింగ్' మూవీ తీసిన కరీంనగర్ యువకుడు
- కథ, స్క్రీన్‌ప్లే, నిర్మాత, హీరో అతనే..
- ట్రైలర్‌తోనే 28 ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫేర్ అవార్డులు
- 128 దేశాల్లో వచ్చే నెల 1న విడుదల


నటీనటులతో వెంకట్‌సాయి



సినిమా పోస్టర్


ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అవార్డుతో..

కరీంనగర్ అర్బన్: సినిమా.. అదో రంగుల ప్రపంచం. అద్భుతంగా తెరకెక్కిస్తే సందేశమేదైనా చేరువ చేసే సాధనం. ఇక, సినిమా తీయాలంటే సాంకేతిక విభాగం, నటీనటులు, ప్రొడక్షన్, డైరెక్షన్ ఇలా ఎన్నెన్నో.. ఆపై హీరోనే నిర్మాతగా, ఫిల్మ్ మేకర్‌గా, కథా రచయితగా రాణించాలంటే కఠోర శ్రమ అవసరం. కానీ, అనుకుంటే కానిది ఏదీ లేదని కరీంనగర్ భగత్‌నగర్‌లోని శ్రీరామకాలనీకి చెందిన గుండ వెంకట్‌సాయి నిరూపించాడు. వృత్తి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం, ప్రవృత్తి నటనగా ముందుకెళ్తూ నిరంతర శ్రమతో సఫలీకృతుడయ్యాడు. 31 ఏళ్ల వయసులోనే ఏకంగా హాలీవుడ్‌లో సినిమా నిర్మించి, ట్రైలర్‌తోనే 28 ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫేర్ అవార్డులు సాధించాడు.

11 ఏళ్ల క్రితం అమెరికాకు..

వెంకట్‌సాయి బీటెక్ పూర్తి చేసి, ఎంఎస్ చదివేందుకు 11 ఏళ్ల క్రితం అమెరికా వెళ్లాడు. తన భార్య ప్రత్యూషతో కలిసి న్యూజెర్సీలో ఉంటున్నాడు. అతనికి మొదటి నుంచి ఫొటోగ్రఫీ, నటనపై మక్కువ. తల్లిదండ్రులు గుండ సునీత–శ్రీనివాస్ వెన్నుతట్టి ప్రోత్సహించారు. ఈ క్రమంలో అమెరికా వెళ్లినా, ఆరంకెల వేతనం వస్తున్నా వెంకట్‌సాయి ఫొటోగ్రఫీ, నటనను వదలలేదు. హాలీవుడ్‌లోనే సినిమా తీయాలి.. తెలుగువాడి సత్తా చాటాలన్న ఆలోచనతో విరామ సమయాల్లో వెబ్‌సిరీస్, ఫొటోగ్రఫీ చేసేవాడు. ×వద్దంటే వస్తావే ప్రేమ₹ 10 ఎపిసోడ్స్ తీసి, ప్రత్యేక గుర్తింపు పొందాడు. బెస్ట్ ఫొటోగ్రాఫర్‌గా అనేక అవార్డులు పొందాడు.

14 రోజుల్లోనే సినిమా తీశాడు..

తప్పు చేసి, పశ్చాత్తపపడే ఇతివృత్తంతో ది డిజర్వింగ్ సినిమా నిర్మించాడు వెంకట్‌సాయి. చిన్నప్పటి నుంచి ఇంగ్లిష్ మూవీస్ చూసే అలవాటు ఉండటంతో తదనుగుణ నటీనటులను ఆడిషన్స్ నిర్వహించి, ఎంపిక చేశాడు. అందరూ అమెరికన్‌లే. గంట పదిహేడు నిమిషాల నిడివి గల ఈ సినిమాను 14 రోజుల్లోనే తీయడం విశేషం. హారర్, థ్రిల్లర్, సైకాలజికల్, ఎమోషనల్ సమ్మిళితమైన మూవీ ఇది. సాయిసుకుమార్, అరోరా(డైరెక్టర్), ఇస్మాయిల్, సీమోన్‌స్టార్లర్, కేసీస్టార్లర్, ప్రియ(మోడల్), మారియంలు సినిమా నిర్మాణంలో ఎంతో సహకరించారని వెంకట్‌సాయి తెలిపాడు. అక్టోబర్ 1న 128 దేశాల్లో సినిమా విడుదల కానుందని పేర్కొన్నాడు.

సినిమా కోసం చాలా కష్టపడ్డాను



ది డిజర్వింగ్ సినిమా తీసేందుకు ఐదేళ్లు పట్టింది. కథ రాయడం నుంచి సినిమా పూర్తయ్యే వరకు చాలా కష్టపడ్డాను. టాలీవుడ్‌లో ఎన్నైనా టేక్‌లు తీసుకోవచ్చు. హాలీవుడ్‌లో అలా కాదు.. డబ్బింగ్ ఉండదు. నటులు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారమే పూర్తి చేయాలి. వాయిదా పడితే మళ్లీ ఏళ్లు పడుతుంది. చిన్నతనంలో తాతయ్య, నాన్న కథలు చెప్పేవారు. ఇంగ్లిష్ సినిమాలు ఎక్కువ చూసేవాణ్ని. ఇంగ్లిష్‌వారికి నచ్చేలా మన కథనే కొంత మార్పు చేశా. సినిమా నిర్మాణంలో నా భార్య ప్రత్యూష సహకారం మరువలేను. టీం అంతా ఒక స్నేహపూర్వక వాతావరణంలో సినిమా చేశాం. తెలుగు వ్యక్తిగా త్వరలోనే టాలీవుడ్‌లో నటిస్తా.

– గుండ వెంకట్‌సాయి

ప్రపంచస్థాయిలో గుర్తింపు



నా కొడుకు వెంకట్‌సాయికి చిన్నప్పటి నుంచి సినిమాలంటే పిచ్చి. ఎక్కువగా ఇంగ్లిష్ మూవీస్ చూసేవాడు. కెమెరా పట్టుకొని, ఫొటోలు తీస్తూ తన సరదా తీర్చుకునేవాడు. మేము ఏనాడూ తన ఇష్టాలను కాదనలేదు. అమెరికా వెళ్తానంటే పంపించాం. అక్కడ ఉద్యోగం చేస్తూనే ప్రపంచం మెచ్చే స్థాయిలో సినిమా తీస్తాడని కలలో కూడా ఊహించలేదు. గ్రేట్‌రా సాయి.

– గుండ శ్రీనివాస్, వెంకట్‌సాయి తండ్రి